ప్రజాశక్తి

సోమవారం 13 మార్చి 2023

5

అల్లూరి సీతారామరాజు



ఇంటర్ విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వకుంటే క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి-పాడేరు: ఫీజులు కట్టలేదనే నెపంతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వలేదని ఫిర్యాదు అందినా, విద్యా సంవత్సరం కోల్పోయినట్లు గుర్తిస్తే ఆయా కళాశాలల గుర్తింపును 2023-24 విద్యా సంవత్సరం నుండి రద్దుకు, క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సిఫారసులు చేయనున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం హెచ్చరించారు.ఆదివారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో విద్యార్థులను మానసికంగా ఫీజుల పేరిట వేధిస్తున్నట్టు తల్లిదండ్రుల నుండి తమకు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. వీటిని పరిశీలనలోకి తీసుకొని ఆయా యాజమాన్యాలపై అవసరమనుకుంటే క్రిమినల్ చర్యలకు కమిషన్ తరపున సిఫారసులు చేయనున్నామన్నారు.ఇంటర్మీడియట్ బోర్డు సూచించిన టోల్ ఫ్రీ నెంబర్ 1800 4257635కు ఫిర్యాదులు అందిస్తే చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సిద్ధంగా ఉందని సీతారాం చెప్పారు.

నేడే ఎమ్మెల్సీ ఎన్నికలు



- ఉదయం 8 గంటల నుండి 4 వరకు పోలింగ్
- జిల్లాలో 15 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- మొత్తం ఓటర్లు 11,525



ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు, పాడేరు టౌన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ముహూర్తం ఆసన్నమయింది. ఈనెల 13న సోమవారం ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆదివారం ఉదయమే పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులతో సహా తమకు కేటాయించిన వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 11 మండలాలలో ఈ ఎన్నికకు సంబంధించి 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసారు. 11 మండలాలలో 11 పోలింగ్ కేంద్రాలతో పాటు హుకుంపేట, జి.కే వీధి, పాడేరు, అరకులలో అదనంగా ఒక్కో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసారు. జిల్లాలో పురుష ఓటర్లు 7861 మంది, మహిళా ఓటర్లు 3661 మంది నమోదు కాగా ముగ్గురు ఇతర ఓటర్లతో కలిపి 11525 మంది పట్టభద్రుల ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. 11 మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగియనుంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిమిత్తం ఓటు హక్కును వినియోగించుకునే ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ ప్రభుత్వం ఒకరోజు సెలవు మంజూరు చేసింది. అల్లూరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 13వ తేదీ సాయంత్రం పోలింగ్ అనంతర మెటీరియల్ తీసుకోవడానికి కూడా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసారు. పోలింగ్ అనంతరం జిల్లా కేంద్రంలోని తలారిసింగి స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్స్‌లు తరలించి సోమవారం రాత్రి భద్రపరిచి ఓట్ల లెక్కింపు కేంద్రమైన విశాఖలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంకు షీల్డ్



బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది

బ్యాలెట్ తరలించేందుకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టారు.

పటిష్ట చర్యలు

జిల్లాలోని పాడేరు డివిజన్ 11 మండలాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాలకు ఆదివారం ఎన్నికల సిబ్బంది తరలి వెళ్లారు. జిల్లా కేంద్రం పాడేరులో తలారిసింగి జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాల (బాలురు) ఆవరణలో పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేసి పోలింగ్ కేంద్రాలకు ఆర్‌టిసి బస్సుల్లో తరలించారు. పాడేరు డివిజన్ పరిధిలో 15 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 7 బస్సులు ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. కలెక్టరేట్ నుంచి ఎన్నికల సామాగ్రిని ఉదయం 6 గంటలకే డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి తరలించారు. అక్కడ నుండి జోన్/రూట్‌ల వారీగా కేటాయించిన ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు ఏర్పాటు చేసిన ఆర్‌టిసి బస్సుల్లో పోలీసు బందోబస్తుతో తరలి వెళ్లారు.



సిద్ధం చేసిన బస్‌లు

ఎన్నికల సామగ్రిని కలెక్టర్ పరిశీలన

జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్ ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల సిబ్బంది, పోలీసు సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి నేరుగా పోలింగ్ కేంద్రానికి తప్ప మధ్యలో ఎక్కడా ఆగరాదని ఆదేశించారు. మధ్యలో ఆగితే తీవ్రంగా పరిగణించాల్సి వస్తోందని హెచ్చరించారు.

సిబ్బందికి జెసి సూచనలు

అనంతరం జెసి, ఎన్నికల ప్రత్యేక అధికారి జె.శివశ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్నికల సిబ్బందికి ఎన్నికల నియమావళిని క్షుణ్ణంగా వివరించారు. ఎన్నికల సామగ్రి తీసుకుని తిరిగి అప్పజెప్పేంత వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన వర్క్ పై పూర్తి అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. ఎన్నికలకు సంబంధించి సామాగ్రి వాడే విధానంతో పాటు కవర్లను, పేపర్లను ఏ విధంగా వాడాలి, మడత పెట్టాలన్నది చేసి చూపించారు. పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన కల్పించారు. ఏజెన్సీ 11 మండలాలను మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా గుర్తించి కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సాల్, డిఆర్ఒ పి.అంబేద్కర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శర్మ, రమణ, పరిపాలనాధికారి చిన్నికృష్ణ, టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, ఎటిడబ్ల్యూఒ ఎల్.రజిని, జోన్/రూట్ అధికారులు పాల్గొన్నారు.


పటిష్ట భద్రతా చర్యలు : ఎస్‌పి సతీష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : ఈ నెల 13న జరగనున్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలు అల్లూరి జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించటానికి అన్ని చర్యలు తీసుకున్నామని ఎస్‌పి సతీష్ కుమార్ పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని ఆయన వివరించారు. ఎన్నికల నిర్వహణకు ఐదు వందల మంది పోలీస్ అధికారులను, సిబ్బందిని వినియోగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా ఒక అదనపు ఎస్పీ, ఇద్దరు డిఎస్పీలు, ఆరుగురు సర్కిల్ ఇన్స్పెక్టర్లతో పాటు 13 మంది సబ్ ఇన్స్పెక్టర్లు, 48 మంది ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్స్, 85 మంది పోలీస్ కానిస్టేబుల్స్, 15 మంది మహిళా పోలిస్ కానిస్టేబుల్స్, ఎఆర్ నుండి 75 మంది, ఎపిఎస్పీ నుండి 56 మంది సిబ్బందిని నియమించామని, వీరు కాకుండా మరో 200 మంది స్పెషల్ పార్టీ సిబ్బందిని కేటాయించడం జరిగిందని ఎస్పీ వివరించారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తితో ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఉమారాణి





జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాం. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టంగా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నాము. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్న తరుణంలో ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఒ) ఉమారాణి ' ప్రజాశక్తి ' ముఖాముఖిలో మాట్లాడారు.

ప్రజాశక్తి-పాడేరు టౌన్:

ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలు

జిల్లాలోని పాడేరు ఐటిడిఎ పరిధిలోని 11 మండలాల్లో ఇంటర్ పరీక్షల నిర్వహణకు 16 కేంద్రాలను ఎంపిక చేశాం. ఎక్కడా ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా పక్కాగా నిర్వహించేందుకు ఆయా కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం.

పర్యవేక్షణకు తీసుకున్న చర్యలు

ఆయా చోట్ల గట్టి నిఘా పెట్టాం. అక్కడ ప్రత్యేకంగా సిట్టింగ్, స్క్వాడ్‌లు ఉంటారు. మిగిలిన కేంద్రాల పర్యవేక్షణకు 4 ఫ్లయింగ్, 8 సిట్టింగ్ స్క్వాడ్‌లతో పాటు అదనపు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమిస్తాం. 16 మంది చీఫ్ సూపరింటెండెంట్లు ఉంటారు.

హాజరుకానున్న విద్యార్థుల సంఖ్య

11 మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లోని మొత్తం 8492 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వారిలో మొదటి ఏడాది జనరల్ పరీక్ష రాసేవారు 3514 మంది, ఒకేషనల్ 878 మొత్తం 4392 మంది, రెండో ఏడాదివారు జనరల్ 3350 మంది, ఒకేషనల్ 750 మంది మొత్తం 4100 మంది ఉన్నారు. మొదటి, రెండో ఏడాది మొత్తం కలిపి 8492 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొదటి ఏడాది 2250 బాలురు, 2142 బాలికలు, రెండో ఏడాది 1980 బాలురు, 2120 బాలికలు పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు.

మౌలిక సౌకర్యాల ఏర్పాటు

అన్ని కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఫర్నీచర్, విద్యుత్తు, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉంచుతాం.

కొత్తగా పరీక్ష కేంద్రాలు

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ పరిధిలో ఈ ఏడాది కొత్తగా 6 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసాం. కొయ్యూరు, ముంచంగిపుట్టు, చింతపల్లి, జికె వీధి, అనంతగిరి మండలాల్లో పాటు ఎగువ సీలేరులో ఇంటర్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం.

కేంద్రాల వద్ద భద్రత చర్యలు

అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా పోలీసు బందోబస్తు ఉంటుంది. హై పవర్, పరీక్షల నిర్వహణ కమిటీ, డివిఇఒ, ఆర్ఐఒలు కూడా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తారు.

పరీక్షల సమయం

మొదటి, రెండో ఏడాది విద్యార్థులిద్దరికీ నిర్దేశించిన తేదీల్లో పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరుగుతాయి. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలి. ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలకు అనుమతించేది లేదు. పరీక్షకు ముందురోజే కేంద్రాన్ని చూసుకోవడం మంచిది.

కంట్రోల్ రూం ఏర్పాటు

విద్యార్థులకు ఎలాంటి సందేహాలు, సమస్యలు ఉన్నా తెలియజేయవచ్చు. ఇందుకుగాను జిల్లా కేంద్రంలోని ఆర్‌ఎస్ఐఒ కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. 0891 2552954 హెల్ప్ లైన్ నంబర్ కు ఫోన్ చేయవచ్చు.

జల విద్యుత్ కేంద్రాన్ని హైడల్ డైరెక్టర్ సందర్శన

అండర్ గ్రౌండ్ టన్నెల్ ప్రాజెక్టు ప్రదేశాన్ని పరిశీలన



ప్రాజెక్ట్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న హైడల్ డైరెక్టర్ సత్యనారాయణ

ప్రజాశక్తి -సీలేరు: ఎపి జెన్‌కో హైడెల్ డైరెక్టర్ ఎంవి.సత్యనారాయణ ఆదివారం సీలేరు జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. ఇంజనీర్లు, కార్మికులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ క్రమంలోనే ఇంజనీర్లకు కార్మికులకు ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. జల విద్యుత్ కేంద్రంలో ఉన్న నాలుగు యూనిట్లు పనితీరు తదితర అంశాలపై ఇంజనీర్లతో సుదీర్ఘంగా చర్చించి తెలుసుకున్నారు. జలవిద్యుత్ యూనిట్లు పనితీరు స్వయంగా పరిశీలించారు. రెండో యూనిట్ ఓవరాల్ పనులకు చేసుకుంటామని డైరెక్టర్ సత్యనారాయణను ఇఇ లక్ష్మీనారాయణ కోరారు. రాష్ట్రంలో పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని మే నెలలో రెండో యూనిట్ ఓవరాల్ పనులకు తీసుకోవాలని ఆదేశించారు.

అలాగే ఇటీవల యూనిట్లకు అమర్చిన డిజిటల్ ఆటోమేటిక్ రెగ్యులేటర్ పనితీరు ఏ విధంగా ఉందని డైరెక్టర్ సత్యనారాయణ ఆరా తీశారు. అనంతరం జల విద్యుత్ కేంద్ర సమీపంలో ఉన్న పార్వతి నగర్ వద్ద 1350 మెగావాట్లు సామర్థ్యం గల పంపు స్టోరేజ్ టన్నెల్ ప్రాజెక్టు నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించి పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన మ్యాపును పరిశీలించి విధి విధానాలను ఇంజనీర్లు అడిగి అరా తీశారు. సీలేరు జలాశయం సమీపంలో ఉన్న శాండ్‌కోరి గ్రామం నుంచి భూఅంతర్భాగంలో నిర్మిస్తున్న టన్నెల్‌కు సంబంధించిన పాయింట్లు వివరాలు రూట్ మ్యాప్ ఆధారంగా ఏ విధంగా ఉన్నాయనే దానిపై ఐడల్ డైరెక్టర్ సత్యనారాయణకు ఎఇ సురేష్ వివరించారు. కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి. శ్రీధర్, ఇఇలు బాలకృష్ణ, బాబూరావు, ప్రభాకర్, ఎఇ సురేష్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పాడేరు టౌన్: స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో పాడేరు మండలం యుటిఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల పరిశీలకులుగా అసోసియేట్ అధ్యక్షులు సిహెచ్.నాగేశ్వరరావు వ్యవహరించారు. యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులుగా టి.కామేశ్వరరావు, అధ్యక్షులుగా వి.మహేశ్వరరావు, ఉపాధ్యాక్షులుగా జి.ఈశ్వరరావు, డి.ఈశ్వరి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కర్రిబాబు, కోశాధికారిగా సిహెచ్.కొండబాబు, కార్యదర్శులుగా ఎం.లక్ష్మణ, కె.భీమరాజు, ఆడిట్ కమిటీ సభ్యులుగా రొబ్బ కావ్య, జిల్లా కౌన్సిలర్‌గా ఎస్.కర్రిబాబు ఎన్నికయ్యారు.

ప్రమాదం జరిగితే గానీ పట్టించుకోరా..?

- అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి
- నూతులను తలపిస్తున్న గోతులు!
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని నేతలు, అధికారులు



చింతూరు ఎర్రంపేట వద్ద రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులు

ప్రజాశక్తి -చింతూరు.: చింతూరు డివిజన్ కేంద్రంలోని ఎర్రంపేట గ్రామం నుంచి ఒడిశావైపు వెళ్లే అంతర రాష్ట్ర రహదారిలో గోతులు నూతులను తలపిస్తున్నాయి. ఆంధ్రా వైపు నుంచి ఒడిశా; తెలంగాణ రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న అంతరరాష్ట్ర రహదారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బస్సులతోపాటు సరుకులు రవాణా చేసే భారీ వాహనాలు, ఇతరత్రా చిన్నవాహనాలు లెక్కలేనన్ని ఇదే మార్గంలో ప్రయాణిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ రహదారిలో ఎర్రంపేటవద్ద మలుపులో ఏర్పడిన భారీ గోతులు గడచిన ఏడాది కాలంగా అలాగే ఉండి, వాహనదారులు, ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నాయి. భారీ వాహనాలు ఈ గోతుల్లో దిగితే ముందుకు కదలడానికి నానాయాతన పడాల్సినంత పెద్దవిగా, భయంకరంగా ఈ గోతులు ఉన్నప్పటికీ వీటిని పూడ్చేందుకు సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగి, ప్రాణనష్టం జరిగితేగానీ, ప్రమాద భరితంగా ఉన్న ఈ గోతులవైపు సంబంధిత అధికారులు కన్నెత్తి చూడరా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రహదారి మలుపులో ప్రమాదభరితంగా ఉన్న ఈ గోతులను పూడ్చి, రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులు, నేతలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవంపై వాహనదారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలోని రహదారులపైనే రోజుల తరబడి ఇంత నిర్లక్ష్యం ఉంటే, మారుమూల గ్రామాల్లో రోడ్ల అధ్వానస్థితిపై ప్రభుత్వయంత్రాంగం ఇంకెంత నిర్లిప్తతతో వ్యవహరిస్తుందో ఇట్టే అర్థమౌతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ రోడ్డుగోతులపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో బ్యాలెట్ బాక్సులు

పటిష్ట భద్రతకు సబ్ కలెక్టర్ అభిషేక్ చర్యలు



సీలేరు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్

ప్రజాశక్తి -సీలేరు: ఏజెన్సీలోని జికె.వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బ్యాలెట్ బాక్సులను భద్రత దృష్ట్యా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆదివారం సాయంత్రం కట్టుదిట్టమైన పోలీసు భద్రత మధ్య బ్యాలెట్ బాక్స్‌లను ప్రత్యేక బస్సులో సీలేరులోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎన్నికల జోనల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్ సీలేరు పోలింగ్ కేంద్రానికి వచ్చారు. కేంద్రంలో పోలింగ్ ఏర్పాట్లపై విఆర్ఒ శ్రీనివాస్, కార్యదర్శి వెంకటరామును ప్రశ్నించారు. పోలింగ్ బ లో ఏర్పాటు చేసిన వెబ్ కెమెరా సక్రమంగా పనిచేస్తుందా లేదా పర్యేక్షిస్తుండాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. వెబ్‌కెమెరా పనిచేయని పక్షంలో వీడియో కెమెరాతో పోలింగ్‌సరళిని విధిగా రికార్డు చేయాలని సూచించారు. అనంతరం పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ బాక్సుల భద్రతపై స్థానిక ఎస్ఐ రామకృష్ణతో చర్చించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో భద్రత దృష్ట్యా బ్యాలెట్ బాక్సులను హైస్కూలులో ఉంచడం అంత సురక్షితం కాదని సబ్ కలెక్టర్ అభిషేక్ దృష్టికి ఎస్ఐ రామకృష్ణ తేగా, ఇరువురు చర్చించిన మీదట బ్యాలెట్ బాక్సులకు రాత్రికి పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచి, ఉదయాన్నే పోలింగ్ కేంద్రానికి తీసుకురావాలని నిర్ణయించారు.కాగా సీలేరు పోలింగ్ కేంద్రంలో 56మంది పట్టభద్రుల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ అభిషేక్ మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఏజెన్సీలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఓటరు కాని వారెవరూ పోలింగ్ బూత్‌లోకిగానీ, పరిసరాల్లో సంచరించడానికి అనుమతి లేదన్నారు. సోమవారం ఉదయం నుంచి పోలింగ్ పూర్తయ్యేవరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. తహశీల్దార్ రాజ్‌కుమార్, ఆర్ఐ సహదేవ్, గిరిజన సంక్షేమ విభాగం డిఇఇ చాణక్యరావు,ఎపిఒ ఎల్.రాములు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలేవీ?

వెలుగు ఎపిడి సస్పెన్షన్, సిసి తొలగింపునకు డిమాండ్

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి -రంపచోడవరం : వై.రామవరం వెలుగు కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమని గిరిజన సంఘం నేతలు విమర్శించారు. నిధుల దుర్వినియోగం, అవినీతికి పాల్పడిన సిసి నీలవేణిని విధుల నుంచి తొలగించడంతోపాటు రంపచోడవరం ఎడిపిని సస్పెండ్ చేయాలని గిరిజన సంఘం నేత కంభం శాంతిరాజు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

వై రామవరం వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న సిఇస బి.నీలవేణి, మండలంలోని దేవరమాడుగుల, దాలిపాడు, వై రామవరం, చవిటి దిబ్బలు గ్రామాల మహిళా గ్రూపులకు చెందిన సుమారు రూ.7 లక్షలను సొంత అవసరాలకు వాడుకుని, నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు.. నిధుల దుర్వినియోగంపై వై రామవరం వెలుగు ఎపిఎం మధుబాబు లిఖితపూర్వకంగా రంపచోడవరం ఎపిడికి ఫిర్యాదు చేశారన్నారు. అయితే సిసిపై ఎటువంటి శాఖాపరమైన చర్యలు తీసుకోకపోగా, దుర్వినియోగానికి పాల్పడిన నిధులను 72 నెలలు వాయిదాలలో తిరిగి చెల్లించాలని నిర్ణయించడం శోచనీయమన్నారు. ఈ చర్యలు మరింత మంది ఉద్యోగులు అవినీతి, అక్రమాలకు పాల్పడేందుకు ఆస్కారమిస్తుందన్నారు. ఐటిడిఎ పిఒకు తెలియకుండా ఈవ్యవహారమంతా గుట్టుగా సాగుతోందని పలువురు ఆరోపిస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలకు ఉపక్రమించి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు బాధిత మహిళలకు న్యాయం చేయాలని శాంతిరాజు కోరారు. లేకుంటే గిరిజన మహిళా సంఘాలను సమీకరించి, పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మానవత్వం చాటిన పోలీసులు

నిరుపేద కంటి వైద్యానికి ఆర్థిక సాయం



నూకాలమ్మకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎస్ఐ నరేంద్ర ప్రసాద్ సిబ్బంది.

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : నిరుపేద మహిళకు వైద్యం ఖర్చులకు ఆర్థికసాయం చేయడం ద్వారా స్థానిక ఎస్ఐ టి.నరేంద్రప్రసాద్ మానవత్వాన్ని చాటుకున్నారు. రాజవొమ్మంగి గ్రామానికి చెందిన గూటాల నూకాలమ్మ దాదాపు 12ఏళు గారాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేసోత్తుంది. ఆమె భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందగా, ఉన్న ఒక్కగానొక్క కూతురుతో జీవనం సాగిస్తోంది.ఆమెకు ఎప్పటినుంచో ఒక కన్ను పూర్తిగా కనిపించకపోగా, పదిరోజుల క్రితంఆమె మేనల్లుడి కుమారుడు,మూడేళ్లబాబు ఆడుకుంటూ, విసిరిన టమోటా చూపున్న రెండో కంటికి తగలడంతో గాయమై, ఆ కన్ను కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. విశాఖలోని కంటి వైద్యుల వద్ద పరీక్షించగా, ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో నూకాలమ్మ కంటి ఆపరేషన్‌కు ఎస్ఐ నరేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులంతా సమకూర్చిన రూ.16వేలు నగదును ఆమె వైద్యఖర్చులకు అందజేశారు. వైద్యానికి ఆర్థికసాయం అందించిన పోలీసులను పలువులు అభినందించారు.



రంపచోడవరంలో వైసిపి ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

రంపచోడవరం : వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రంపచోడవరం అంబేద్కర్ సెంటర్ వద్ద వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి, ఇతర వైసిపి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వినూత్న సంక్షేమపథకాలు, విభిన్న సంస్కరణలతో ప్రభుత్వ పాలనను పారదర్శకంగా, జవాబుదారీతనంగా ప్రజలకు చేరువ చేసి, రోల్‌మోడల్‌గా ఉన్న సిఎం జగన్మోహనరెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ సిఎంను చేసేందుకు పార్టీ శ్రేణులు ఇప్పటినుంచే కృతనిశ్చయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. విపక్షాల కుట్రలను, ఆరోపణలను తిప్పికొట్టాలని కోరారు కార్యక్రమంలో ఎంపిపి, జెడ్‌పిటిసి, మండల పార్టీ అధ్యక్షుడు, గృహసారధులు, పార్టీ కన్వీనర్లు ఇతర నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదబయలులో...

పెదబయలు: మండల కేంద్రంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కొర్ర కనకరాజు, వైస్ ఎంపీపీ కొర్ర రాజుబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్య నారాయణ, రాష్ట్ర అగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ సన్యాసి, నాయకులు సూరయ్య, సీకరి సర్పంచ్ గుల్లేలు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు

14న 'మోదకొండమ్మ' కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రలో ఈనెల 14న మంగళవారం మోదకొండమ్మ తల్లి పండుగ నిర్వహణ కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహిస్తామని స్థానిక సర్పంచ్ వెంకట పూర్ణిమ తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండల నాయకులు, ఉద్యోగులు, ప్రతినిధులు, గ్రామ పెద్దలు, పంచాయతీ ప్రజలు, వ్యాపారులు అన్ని వర్గాలకు చెందిన వారు సాయంత్రం 4గంటలకు మోదకొండమ్మ ఆలయంలో హాజరు కావాలని ఆమె కోరారు.

కథ వెనుక కథ చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ : దండమూడి బాక్స్‌ఆఫీస్ పతాకంపై దండమూడి అవనీంద్ర కుమార్ నూతనంగా నిర్మించిన కథ వెనుక కథ చిత్రం యూనిట్ నగరంలో సందడి చేసింది. నగరంలోని ఓ హోటల్లో ఇన్‌స్టాగ్రామ్ ఇన్ఫ్లుయెన్సర్స్‌తో చిట్ చాట్ చేశారు. అనంతరం చిత్ర బృందం మీడియాతో మాట్లాడింది. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గొట్టిపాటి సాయి మాట్లాడుతూ, కథ వెనుక కథ చిత్రం ఈనెల 24న విడుదలకు సిద్ధమైందని తెలిపారు. ఆద్యంతం అందరినీ ఆకట్టుకునే సస్పెన్స్ థ్రిల్లర్‌గా దీన్ని రూపొందించామని చెప్పారు. అన్ని తరగతుల ప్రేక్షకుల్ని ఆకట్టుకునే విధంగా ఈ సినిమాని తీర్చిదిద్దినట్లు తెలిపారు. అనంతరం చిత్ర హీరో (ఓ పిట్టకథ ఫేమ్) విశ్వంత్ మాట్లాడుతూ, తన కెరియర్లో ఈ చిత్రం ఒక మైలురాయిలుగా నిలుస్తుందన్నారు. ఇంతకుముందు ఎప్పుడూ చెయ్యని వినూత్నమైన పాత్రను ఇందులో పోషించానన్నారు. కమెడియన్ మధునందన్ మాట్లాడుతూ పలు చిత్రాల్లో నటించిన తాను, ఈ చిత్రంలో వైవిధ్యభరితమైన పాత్రను పోషించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో చిత్ర దర్శకుడు కృష్ణ చైతన్య, హీరోయిన్లు శ్రీజిత ఘోష్, శుభశ్రీ మాట్లాడుతూ, ఈ చిత్రాన్ని ఆదరించి విజయవంతం చేయాలని కోరారు.

14న సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-సిరిపురం : సినీ సంగీత దర్శకులు కెవి.మహదేవన్ జయంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, అమ్మాజమ్మా, సూర్య ప్రకాశరావు మెమోరియల్స్ ఆధ్వర్యాన ఈ నెల 14వ తేదీన పౌర గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు హైకోర్టు న్యాయవాది, ఆయా సంస్థల అధ్యక్షులు ఎస్ఎన్‌కె మహంతి తెలిపారు. రామ్‌నగర్‌లోని ట్రస్టు కార్యాలయంలో రాష్ట్ర శిష్ట కరణం కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూషా పట్నాయక్ ఆదివారం ఉదయం కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు



పోలింగ్ జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిఐ జీడి బాబు

ప్రజాశక్తి-యంత్రాంగం

అరకులోయ రూరల్: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో అరకు సర్కిల్ పరిధిలోని డుంబ్రిగూడ, అరకువేలి, అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో పటిష్టమైన భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ జీడి బాబు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ,స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించేలా పోలీస్ శాఖ ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.పోలింగ్ జరిగే ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.పోలింగ్ సెంటర్లోకి ఓటు హక్కు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తామన్నారు.గుర్తింపు కార్డులు తీసుకోవాలని తెలిపారు.దొంగ ఓటును వేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే అరకు ఎస్సై, సిఐల ఫోన్: 9440904225, 944090 4226 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

హుకుంపేట: మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీవో వెంకటరావు, తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఎస్ఐ సతీష్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలో నుంచి 1714 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఉదయం 8 గంటలు నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వారు పేర్కొన్నారు. ఎటువంటి సంఘటనలకు తావివ్వకుండా ముందస్తుగానే భారీ పోలీసు బందోబస్తులు ఏర్పాటు చేశామని స్థానిక ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రంగారావు, స్థానిక విఆర్వో కొండబాబు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అధికారులు

ఇష్టపడి చదివితే సత్ఫలితాలు

భారత మానసిక వైద్య సంఘం జాతీయ అధ్యక్షులు రాజు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సెమినార్



మాట్లాడుతున్న రాజు

ప్రజాశక్తి-పాడేరు

పరీక్షల్లో సత్ఫలితాలను సాధించేం దుకు విద్యార్థులు ఎటువంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా మనసుపెట్టి ఇష్టపడి చదవాలని భారత మానసిక వైద్య సంఘం జాతీయ అధ్యక్షులు, ప్రభుత్వ మానసిక ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఎన్ఎన్ రాజు విద్యార్థినులకు ఉద్బోధించారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు బాలికల గురుకుల కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరీక్షలలో మంచి ఫలితాలు - మార్గాలు అనే అంశంపై గిరిజన విద్యార్థులకు శనివారం సాయంత్రం సెమినార్ నిర్వహించారు. ముఖ్య వక్త ఎన్ఎన్ రాజు మాట్లాడుతూ, పరీక్షలంటే విద్యార్థినుల లలో సహజంగా ఉండే భయాన్ని, ఆచరించాల్సిన నియమాలకు సూచనలను వివరించారు. భయం, ఒత్తిడికి గురి కాకుండా ఆరోగ్యకర అలవాట్లపై వివరించారు. ఖాళీ సమయాల్లో ఆటపాటలు, రాయడం, చదవడం సంగీతం వినడం వంటి అలవాట్లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయని ఆయన సూచించారు. పరీక్షలప్పుడు సమయాన్ని వృథా చేసుకోకుండా నిర్ణీత కాలాన్ని గమనంలో పెట్టుకుని చదివితే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఆందోళన విడిచిపెడితే చదివినవన్నీ గుర్తుంచుకొని పరీక్షల్లో బాగా రాయగలుగుతారని ఆయన చెప్పారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.చిన్నారావు మాట్లాడుతూ, విద్యార్థులు పరీక్షలకు ముందు నుంచే చదివితే మంచి ఫలితాలు సాధించ వచ్చునని తెలిపారు. చదువు పట్ల ఏకాగ్రత, ప్రశాంతత చాలా అవసరమన్నారు. మంచి లక్ష్యాలు నిర్దేశించుకుని తమ భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలన్నారు. చదవడం, రాయడం, గ్రూపు చర్చలతో ఎక్కువగా జ్ఞాపకశక్తి ఉంటుందన్నారు. ఏదైనా ఉద్యోగం సాదించాలంటే గట్టిగా సాధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బి.నరేష్, పి.వరహాలు, మండల నాయకులు మాణిక్యం, మత్స్యరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన తాటాకిల్లు

ఇల్లు దగ్ధం : రూ 2 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని అమ్మి రేకుల కొత్తవీధి గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిళ్లు దగ్ధమైంది. సుమారు రూ.2 లక్షలు ఆస్తి నష్టం సంభవించింది, బడదనాంపల్లి పంచాయతీ అమ్మి రేకుల కొత్తవీధి గ్రామంలోని గిరిజన కుటుంబానికి చెందిన బోనెం కామరాజు కుటుంబ సభ్యులంతా ఆదివారం ఉదయం జీడితోట పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అగ్నిప్రమాదం సంభవించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో పక్కన నివసిస్తున్న మాజీ ఎంపిటిసి కుమారుడు ప్రమాదాన్ని పసిగట్టి యువకుల సహాయంతో మంటలు అదుపు చేయడంతో, చుట్టుపక్కల ఇళ్లకు వ్యాపించకుండా పెద్ద ప్రమాదాన్ని తప్పించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్లే జరిగిందని భావిస్తున్న ఈ ప్రమాదంలో కామరాజు ఇంట్లో బీరువా పూర్తిగా దగ్ధమై, విలువైన భూమి పత్రాలు, బ్యాంక్ అకౌంట్, కొంత నగదు, ఆధార్, రేషన్ కార్డులతో సహా విలువైన సామగ్రి సర్వం బూడిదైందని బాధితులు ఆవేదనతో తెలిపారు. వంటపాత్రలు, గహోపకరణాలు, బట్టలు అగ్నికి ఆహుతవ్వడంతో బాధితులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సర్పంచ్ గొల్లపూడి లక్ష్మీదుర్గ ఆధ్వర్యంలో లబ్బర్తి ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజుహుటాహుటిన సంఘటనా స్థలానికివెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కొంత సహాయం అందజేశారు. సర్వం కోల్పోయి వీధినపడ్డ కామరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపిటిసి దొడ్డంరెడ్డి చింతల్లి కోరారు.

రోడ్డు ప్రమాదంలో సిఐటియు నాయకుడు మృతి



ప్రజాశక్తి-ఉక్కునగరం : కూర్మన్నపాలెంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిఐటియు నాయకుడు యజ్జల వైకుంఠరావు (51) మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం... ఆదివారం ఉదయం స్టీల్‌ప్లాంట్ రోడ్డులో వైకుంఠరావు వాకింగ్ చేస్తున్న సమయంలో చైతన్య కళాశాల సమీపంలో పాల వ్యాన్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన వైకుంఠరావును హుటాహుటిన కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. 1993లో ఉద్యోగం చేరినప్పటి నుంచి సిఐటియులో కార్యకర్తగా, నాయకునిగా పనిచేసే పలువురి మన్ననలు పొందారు. ఆయన కూర్మన్నపాలెంలో నివాసముంటున్నారు. ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వైకుంఠరావు స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా బారువ. స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలో జనరల్ ఫోర్‌మ్యాన్‌గా పనిచేస్తున్నారు. వైకుంఠరావు మంచి ఉద్యోగిగా, సిఐటియుకు బలమైన నాయకునిగా, థ్రిఫ్ట్ సొసైటీ మాజీ డైరెక్టర్‌గా, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో ముందుండి నడిచారు. ప్రస్తుతం సెంట్రల్ ఆఫీస్ బేరర్‌గా పనిచేస్తున్నారు. ఆయన మృతి వార్త విని కార్మికులు, ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. అందరితో కలిసి మెలిసి పనిచేసిన వ్యక్తి మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ప్రమాద వార్త విన్నవెంటనే సిఐటియు స్టీల్ జోన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, శ్రీనివాసరాజు తదితరులు కెజిహెచ్‌కు చేరుకున్నారు. ఆయన మృతి పట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైకుంఠరావును ఢీకొన్న పాల వ్యాన్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



గురుస్థానం ప్లే స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న అతిథులు

ఘనంగా గురుస్థానం స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గురుస్థానం ది ప్లే స్కూల్ వార్షిక వేడుకలు స్థానిక సీతమ్మధారలోని కెఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐహెచ్.ఫరూఖీ, విశిష్ట అతిథిగా 43వ వార్డు కార్పొరేటర్ పి.ఉషశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫరూఖీ మాట్లాడుతూ గురుస్థానం ది ప్లే స్కూల్ పలు బ్రాంచిలతో ఐదేళ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. చిన్న పిల్లలకు ప్రాథమిక దశలో అక్షరాలు నేర్పే ప్లే స్కూల్స్ నిర్వహణ ఎంతో ప్రశంసనీయమని అన్నారు. ఉషశ్రీ మాట్లాడుతూ గురుస్థానం ప్లే స్కూల్ మరింత అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. అనంతరం యుకెజి విద్యార్థులకు కాన్వొకేషన్ జరిగింది. చివరిగా పిల్లలందరూ నృత్య రూపకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్.ఖాన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషా, గౌరవ అతిథి రాజకుమారి, ప్రిన్సిపాల్ గౌసియా భేగం, తల్లిదండ్రులు, విద్యార్థులు, స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

రండి.. గురుకులాల్లో చేరండి

- గురుకుల విద్యాలయాల సమన్వయకర్త రూపవతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల గురుకుల విద్యాలయాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. గురుకులాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నట్టు వెల్లడించారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

ఏయే గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు ?

బాలికల పాఠశాలలైన మేఘాద్రి గెడ్డలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల పాఠశాల, కొమ్మాది, మధురవాడల్లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, కోనాంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం, కొక్కిరాపల్లి, తాళ్లపాలెం, నక్కపల్లి, నర్సీపట్నంల్లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలతో పాటు, బాలుర పాఠశాలలైన సబ్బవరం, శ్రీ కృష్ణాపురం, దేవరాపల్లి, గొలుగొండల్లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం 2023 -24 విద్యా సంవత్సరానికిగాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 24లోగా దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించుకోవచ్చు.

ఎవరు అర్హులు ?

5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారై ఉండాలి. తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.లక్షలోపు ఉండాలి. ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసే విద్యార్థులు, ప్రభుత్వ, ఏదైనా గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యాసంస్థలో 2021-22 విద్యా సంవత్సరంలో 3వ తరగతి, 2022- 23 సంవత్సరంలో 4వ తరగతి నిరవధికంగా పాఠశాల చదువు పూర్తి చేసిన వారై ఉండాలి. ఇంటర్ మొదటి సంవత్సరానికిగాను 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి (ఆంగ్ల మాధ్యమంలో) పూర్తి చేసి ఉండాలి. జిల్లాలో గల ప్రతి గురుకుల పాఠశాల నుంచి బైపీసీ గ్రూపులో 40, ఎంపీసీ గ్రూపులో 40లో సీట్లు ఖాళీలు ఉన్నాయి. 5వ తరగతిలో ఒక్కొక్క పాఠశాలలో 80 ఖాళీలు ఉన్నాయి. దరఖాస్తు చేసే విద్యార్థులు వెబ్ సెంటర్‌నందుగానీ, వారికి దగ్గరలోని గురుకుల పాఠశాలలోగానీ దరఖాస్తులు సమర్పించవచ్చు. ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష ఉంటుంది. 5వ తరగతి విద్యార్థులకు ఆ రోజు ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పరీక్ష ఉంటుంది.

ఎంపికైన వారికి కల్పించే సౌకర్యాలేంటి ?

అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుకలతో పాటు ఉచిత పుస్తకాలు, 4 జతల యూనిఫారాలు, ఉచిత భోజనం, వసతి, అన్ని రకాల పోటీ పరీక్షలకు శిక్షణ, సిబిఎస్ఇ పాఠ్య ప్రణాళిక ప్రకారం బోధన ఉంటాయి.

వైసిపి బరితెగింపు

ఆగని అక్రమాలు

ఓటుకు నోటు పంపిణీలో అడ్డంగా దొరికిన కార్యకర్తలు

భానునగర్, గాజువాకల్లో ఘటనలు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను అపహాస్యం చేసిన అధికార పార్టీ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆది నుంచి అధికార వైసిపి బరితెగించి వ్యవహరిస్తోంది. ఎన్నికల నిబంధనలు, ప్రమాణాలు, ప్రజాస్వామిక పద్ధతులేమీ పాటించడంలేదు. చదువులేని వారిని పట్టభద్రుల ఓటర్లుగా నమోదుచేయడంతో ప్రారంభమైన వైసిపి అక్రమాలు, ఎన్నికల ముందురోజు ఓటర్లకు డబ్బుల పంపిణీ వరకు కొనసాగుతూనేవున్నాయి. ఎన్ని అక్రమాలకు పాల్పడినా, అధికార దుర్వినియోగానికి ఒడిగడుతున్నా అధికార యంత్రాంగం చేతులుకట్టుకొని కూర్చొంది. వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపుకోసం ఎన్ని అడ్డదారులున్నాయో వాటన్నింటినీ అధికార పార్టీ ప్రయోగించి పట్టభద్రుల ఎన్నికలను అపహాస్యం చేసింది. మూడు సార్లు జరిగిన ఏ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఈ తరహా అప్రజాస్వామిక కార్యక్రమాలు ఇంతలా చోటుచేసుకోలేదు. వార్డు, గ్రామ వాలంటీర్లను ఎన్నికల విధుల్లో భాగస్వాములు చేయొద్దని ఎన్నికల సంఘం స్పష్టంగా ఆదేశించినా వైసిపి లెక్కచేయలేదు. ఓటుకు నోటు పంపిణీలో వాలంటీర్లను ఉపయోగించుకుంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అన్ని ప్రాంతాల్లో వైసిపి కొంతమంది ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసింది. ఈ పంపిణీ వాలంటీర్ల సమక్షంలో చేపట్టింది.

ఆదివారం విశాఖ నగరంలోని 16వ వార్డు, భానునగర్‌లో వైసిపి కార్యాలయానికి సమీపంలో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తుండగా వైసిపి కార్యకర్త దొరికిపోయాడు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మద్దతుదారులు డబ్బులు పంపిణీ చేస్తున్న వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మరికొంత మంది పారిపోయి తప్పించుకున్నారు. ఓటర్ల జాబితా పట్టుకొని ఓటుకు వెయ్యి రూపాయలు చొప్పున పంపిణీచేస్తూ పట్టుబడ్డ కొల్లి ఈశ్వరరావు అనే వైసిపి కార్యకర్త వైసిపి కార్యాలయం నుంచే లక్ష రూపాయలు తెచ్చినట్లు పోలీసులు, సీతమ్మధార తహశీల్దార్ శ్యామ్‌కుమార్ ముందు తెలిపాడు. లక్ష రూపాయల్లో 17 మంది ఓటర్లకు వెయ్యి చొప్పున 17 వేలు ఇచ్చాడు. మిగిలిన 83 వేలతో దొరికిపోవడంతో సీజ్‌చేసి పోలీసులు కేసు నమోదుచేశారు. పట్టభద్రుల ఓటర్లలో డబ్బులు తీసుకొని ఓటేసే వారిని వాలంటీర్ల ద్వారా గుర్తించి, వారికి వైసిపి కార్యకర్తలతో పట్టపగలు డబ్బులు పంపిణీచేసే దిగజారుడుతనానికి వైసిపి దిగింది. ఓటర్‌ను బట్టి ఐదు వందల నుంచి వెయ్యికి పైగా పంపిణీ చేశారు. సుధాకర్ క్యాంపు కార్యాలయంలో ఓటర్లకు వెండి నాణేల పంపిణీకి ప్యాకింగ్ చేసిన వ్యవహారం బయటపడకుండా అధికార యంత్రాంగం కాపాడింది. చివరకు అక్కడ కరపత్రాలున్నాయని తేల్చి వారి అక్రమాలను సమర్థించేలా వ్యవహరించిందన్న విమర్శలు బలంగావున్నాయి. అంతకు కొన్ని రోజుల ముందు దసపల్లా హోటల్లో ప్రయివేటు డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్లతో ఎయు విసి ప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం నిర్వహించినట్లు వీడియోలతో సహా బయటపడినా విచారణలో ఆయన్ను రక్షించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ విజయం తథ్యమన్న ప్రచారం బలంగావుండడం, అనేక తరగతుల పట్టభద్రులు ఆమెను బలపర్చడంతో అక్రమ పద్ధతులకు అధికార వైసిపి దిగింది. సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనర్హులతో ఓట్లు వేయించేందుకు కూడా సిద్ధపడుతోంది.



డబ్బులు పంచుతూ దొరికిపోయిన వైసిపి కార్యకర్త ఈశ్వరరావు

గాజువాక : నియోజవర్గం మొత్తం వైసిపి నేతలు ఓట్ల కోసం డబ్బులు పంచారు. పార్టీ వార్డు అధ్యక్షులు, కార్పొరేటర్లు దీనికి నాయకత్వం వహించారు. గాజువాక టిఎన్ఆర్ క్యాంపస్ వద్ద డబ్బులు పంపిణీ చేస్తుండగా సిఐటియు నాయకులు జి.శ్రీనివాసరావు స్థానిక న్యూ పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి అక్కడేమీ జరగలేదని చెప్పి వెళ్లిపోయారు. కానీ వెయ్యి రూపాయలు పంపిణీ చేసినట్లు ఒక మహిళా ఓటరు తెలిపారు. ఇక్కడా పోలీసులు కన్నెత్తి చూడలేదు.

విశాఖపట్నం : కరాస, కప్పరాడ, కంచరపాలెం ప్రాంతాల్లో వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు డబ్బులు పంపిణీ చేశారు. ఫోన్ పే, గూగుల్ పే ద్వారానూ డబ్బులు ఓటర్లకు పంపిణీ చేసినట్టు తెలిసింది.



నిరసన తెలుపుతున్న పిడిఎఫ్ మద్దతుదారులు



స్వర్ణభారతి స్టేడియం నుంచి బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న సిబ్బంది

బ్యాలెట్.. బుల్లెట్

- 37 మంది నిలిచిన బరి.. నేడే పట్టభద్రుల ప్రతిధ్వని

- ప్రధాన పక్షాల మధ్య పోటీ

- పిడిఎఫ్‌కు పట్టంకట్టే దిశగా పట్టభద్రులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రులు నేడు తమ ఓటుతో ప్రతిధ్వని వినిపించనున్నారు. పోలింగ్ ఎలాగూ లాంఛనమే. ఈ సారి పిడిఎఫ్‌కు పట్టభద్రులు తమ 'బ్యాలెట్ బుల్లెట్' ద్వారా అభిమానాన్ని చాటుకోనున్నారన్న చర్చ ఉత్తరాంధ్ర జిల్లాల అంతటా ఆదివారం నాటికి ప్రతిధ్వనిగా ఉంది. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు పట్టం కట్టే దిశగా పట్టభద్రులైన ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులంతా సిద్ధమవుతున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత వాస్తవ సమస్యలు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, ఉద్యోగులపై ప్రభుత్వ వేధింపులపై పోరాడుతున్న ప్రజాసంఘాల తరపున డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అభ్యర్థి కావడమే 'ఏకపక్ష ఓటింగ్'కు ఆస్కారం ఏర్పడుతోందని ప్రస్తుత పరిణామాలతో స్పష్టమవుతోంది. పలు పార్టీలు బరిలో ఉండి ఓట్ల చీలిక జరిగినా పిడిఎఫ్ ఓటింగ్ మాత్రం చెక్కు చెదిరే అవకాశం లేదన్నది తెలుస్తోంది.

బూత్‌లలో 6 గంటల నుంచే పోలింగ్ సిబ్బంది

అన్ని చోట్లా ఉదయం 8 గంటలకే పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 4 గంటల వరకూ ఎలక్షన్ జరుగనుంది. ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ స్టేషన్లలో ఉత్తరాంధ్ర అంతటా సిద్ధంగా ఉంటారు. విశాఖలోని స్వర్ణభారతి స్టేడియం నుంచి పోలింగ్ సామగ్రి ఇప్పటికే తరలివెళ్లింది. పోలింగ్ బూత్‌లలో ఆయా పార్టీలు, వ్యక్తులకు సంబంధించిన ఏజెంట్ల వివరాలు, ప్రక్రియను ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల మధ్య సిబ్బంది పరిశీలిస్తారు. మద్యం, ధనం, బహుమతులను సాధారణ ఎన్నికలను గుర్తుకు తెచ్చేలాగే ప్రధాన పార్టీలకు చెందిన (ముఖ్యంగా వైసిపి) అభ్యర్థులు రంగంలోకి దించినా పట్టభద్రులెక్కడా చలించకపోవడం స్పష్టంగా ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుస్తోంది. శాసన మండలి ఎన్నికల్లో అధికార వైసిపి, తెలుగుదేశం, బిజెపి అభ్యర్థులు ఉన్నా.. 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్‌కు చెందిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అశేషంగా ప్రచారంలో పట్టభద్రుల హృదయాలను గెలుచుకున్నారు. పై నలుగురితో కలిపితే మొత్తంగా 37 మంది ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల బరిలో నిల్చొనడం ఈ సారి ప్రత్యేకత. మొత్తంగా ఓటర్లు 2 లక్షలా 89 వేలా 214 మంది ఈ ఎన్నికల్లో ఓటు హక్కును కలిగి ఉన్నారు. వీరిలో ఎంత మంది ఓటింగ్‌కు వస్తారన్నది చూడాల్సిందే.

పోలింగ్ ఘట్టం నేడే

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు సంబంధించి అన్ని దశలూ పూర్తయ్యాయి. సోమవారం పోలింగ్ దశ. 11వ తేదీ వరకూ జరిగిన ప్రచార పర్వంలో అధికార వైసిపి డబ్బు, బహుమతుల పంపకాలతో పట్టభద్రులను ప్రలోభాలకు గురి చేసే ప్రయత్నాలను ప్రజాసంఘాల కార్యకర్తలు కొన్నిచోట్ల ఇప్పటికే తిప్పికొట్టారు. అయినా అక్రమ పద్ధతులను ఆ పార్టీ విడనాడలేదు. ఆదివారం రాత్రంతా డబ్బు పంపకాలు అన్నిచోట్లా కొనసాగాయి. ఎన్నికల సంఘం నిబంధనలన్నిటినీ ఉల్లంఘించిన ఏకైక పార్టీగా వైసిపి ఉంది. ఉద్యోగులు, ప్రభుత్వ సిబ్బందితో రహస్య సమావేశాలు, రూ.లక్షలు డబ్బు పంపిణీతో అడ్డంగా ఆ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కన్నంలో తేలుకుట్టిన దొంగలా దొరికిపోతూనే ఉన్నారు. అయినా సరే డబ్బు పంపకాలకు వెనుకాడడం లేదు. ప్రలోభాలు, ప్రాపకాలు, పంపకాలతో వైసిపి చెలరేగిపోతోంది. బిజెపి అభ్యర్థి పివిఎన్.మాధవ్ సైతం ఈ ఎన్నికల్లో డబ్బు పంపకాలకు తెర తీశారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల నుంచి పట్టభద్రులకు చేరాల్సిన తాయిలాల విషయంలో మధ్యలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తల ఆమ్యామ్యాయాలు అధికంగా ఉన్నాయన్న చర్చ ఆదివారం సాయంత్రానికి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి వినిపించింది.